‘అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతాం’



కార్పొరేటర్‌ భీశ్వ సురేఖ, అధికారులతో సమావేశం నిర్వహించిన డిప్యూటీ కమిషనర్‌ విద్యాధర్‌

అబిడ్స్‌: జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో వేగవంతంగా అభివృద్ధి పనులు చేపడుతామని అబిడ్స్‌ జీహెచ్‌ఎంసీ 14వ సర్కిల్‌ డిప్యూటీ కమిషనర్‌ విద్యాధర్‌ పేర్కొన్నారు. అబిడ్స్‌లోని సర్కిల్‌ కార్యాలయంలో గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్‌ డాక్టర్‌ భీశ్వ సురేఖ విజ్ఞప్తి మేరకు ఆయా శాఖల అధికారులతో డిప్యూటీ కమిషనర్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయని అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, ఇతర మరమ్మతులు వేగంగా చేపట్టాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లపై చెత్తాచెదారం ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యాధర్‌ మాట్లాడుతూ..మొన్నటి వరకు ఎన్నికల కోడ్‌ అమలులో ఉన్నందునా అభివృద్ధి చేపట్టలేకపోయామన్నారు. కస్టమ్స్‌ అన్ని శాఖల అధికారులు ప్రతిరోజూ ఆయా ప్రాంతాల్లో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారిస్తారని తెలిపారు. రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, రోడ్ల మరమ్మతులు, వీధి దీపాల ఏర్పాటు, శానిటేషన్‌ పనులు ఇతర పనులన్నీ వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కీలక ప్రాంతాల్లో మొక్కలు నాటి చెట్లు పెరిగే విధంగా చర్యలు తీసుకుంటామని విద్యాధర్‌ పేర్కొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యా బోధన జరగాలి



గోల్కొండ: సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యాబోధన జరగాలని డక్కన్‌ ఛాప్టర్‌ హైదరాబాద్‌ చైర్మన్‌ డాక్టర్‌ సీఎస్‌ఆర్‌ ప్రభు అన్నారు. శనివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్‌ కళాశాలలో జరిగిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జీఎన్‌ఐటీఎస్‌ సహకారంతో ఫుల్‌ స్టాక్‌ డెవలప్‌మెంట్‌ యూజింగ్‌ జావా అనే అంశంపై జీఎన్‌ఐటీఎస్‌లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్‌ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్‌ ఇంటలిజెన్స్‌ వేగంగా విస్తరించడంతో పాటు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి డాక్టర్‌ మునిరాజ్‌నాయుడు, డాక్టర్‌ తిలోత్తమ గోస్వామి తదితరులు పాల్గొని కళాశాల ఉపాధ్యాయులకు ఆర్టిఫిషియల్‌ లెర్నింగ్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీఎన్‌ఐటీఎస్‌ చైర్మన్‌ జి.రాఘవరెడ్డి, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.రమేష్‌రెడ్డి, అకాడమిక్స్‌ డీన్‌ డాక్టర్‌ కె.రామలింగారెడ్డి, డాక్టర్‌ సీత, డాక్టర్‌ కల్యాణి, సీహెచ్‌ జలందర్‌ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న అధ్యాపకులకు జి.రాఘవరెడ్డి ప్రశంస పత్రాలు, సర్టిఫికెట్లు అందజేశారు.

బక్రీద్‌కు రౌండ్‌ ది క్లాక్‌ సేవలు

- ఇబ్బందులు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు
- జంతువుల వ్యర్థాల కోసం గార్బేజ్‌ కవర్ల పంపిణీ
- కో ఆర్డినేషన్‌ సమావేశంలో డీసీపీ స్నేహ మెహ్రా



మాట్లాడుతున్న డీసీపీ స్నేహా మెహ్రా, హాజరైన అధికారులు

చార్మినార్‌: బక్రీద్‌ పండుగకు ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా అన్నారు. జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ టి.వెంకన్నతో పాటు విద్యుత్‌, జలమండలి తదితర ప్రభుత్వ విభాగాల అధికారులతో కలిసి ఆమె శనివారం పురానీహవేలీలోని డీసీపీ కార్యాలయంలో ఉన్నతాధికారులతో కో ఆర్డినేషన్‌ మీటింగ్‌ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు జంతువుల వ్యర్థాలను తొలగించాలన్నారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ జంతువుల వ్యర్థాలు వేయకుండా ఆయా పోలీస్‌స్టేషన్‌ పరిధుల్లోని ఇళ్లకు గార్బేజ్‌ కవర్లను అందజేయాలన్నారు. ఈ కవర్లలోనే తమ ఇంట్లోని జంతువుల వ్యర్థాలను వేయాలని సూచించారు. విద్యుత్‌ సరఫరాలో ఎలాంటి ఆటంకాలు లేకుండా నిరంతరం విద్యుత్‌ సరఫరా కొనసాగించాలని సూచించారు. ఎక్కడైనా సాంకేతిక పరంగా విద్యుత్‌ సరఫరాలో సమస్యలు తలెత్తితే వెంటనే స్పందించాలన్నారు. ఇక జలమండలి ఆధ్వర్యంలో రోడ్లపై ఎక్కడిక్కడ డ్రైనేజీలు పొంగి మురుగునీరు రోడ్లపై పారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కుళాయిల ద్వారా తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల నడుమ సమన్వయంతో పని చేస్తే ఎక్కడ ఎలాంటి సమస్యలు తలెత్తవన్నారు. బక్రీద్‌ పండుగ సందర్భంగా ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది రౌండ్‌ ది క్లాక్‌ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో దక్షిణ మండలం అదనపు డీసీపీ షేక్‌ జహంగీర్‌తో పాటు జలమండలి, విద్యుత్‌ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రేపు పాతబస్తీలో ట్రాఫిక్‌ ఆంక్షలు

చార్మినార్‌: ఈద్‌–ఉల్‌–జుహా (బక్రీద్‌)ను పురస్కరించుకొని మీరాలం ఈద్గా లో ఈనెల 17న ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు మీర్‌ ఆలం ఈద్గా రూట్‌లో ట్రాఫిక్‌ ఆంక్షలు కొనసాగుతాయని నగర ట్రాఫిక్‌ అదనపు పోలీస్‌ కమిషనర్‌ తెలిపారు. ఇందులో భాగంగా వాహనాల దారి మళ్లింపు, పార్కింగ్‌ ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా ఏవైనా సమస్యలు తలెత్తితే 9010203626 హెల్ప్‌ లైన్‌ నెంబర్‌లో సంప్రదించాలని ఆయన కోరారు.

పురానాపూల్‌ నుంచి మీర్‌ ఆలం ట్యాంక్‌ ఈద్గా వైపు..

పురానాపూల్‌, కమాటిపురా, కిషన్‌బాగ్‌ నుండి ప్రార్థనల కోసం ఈద్గా, మీర్‌ ఆలం ట్యాంక్‌ వైపు వచ్చే నమాజీల వాహనాలు బహదూర్‌పురా ఎక్స్‌ రోడ్స్‌ మీదుగా ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు అనుమతించబడతాయి. వాహనదారులు తమ వాహనాలను కింద పేర్కొన్న పార్కింగ్‌ ప్రదేశాలలో పార్క్‌ చేయాలి. ఈ సమయంలో, సాధారణ వాహనాల రాకపోకలు ఈద్గా, తాడ్‌ బన్‌ వైపు అనుమతించబడవు. బహదూర్‌పురా ఎక్స్‌ రోడ్‌ల వద్ద కిషన్‌బాగ్‌, కమాటిపురా, పురానాపూల్‌ వైపు మళ్లించబడతాయి.

పార్కింగ్‌ స్థలాలు ఇక్కడ..

జూ పార్క్‌ వద్ద పార్కింగ్‌ ప్రాంతం, ఓపెన్‌ స్పేస్‌ ఎదురుగా, మజీద్‌ అల్లా–హో–అక్బర్‌

శివరాంపల్లి, దానమ్మ హట్స్‌ వైపు నుంచి..

ప్రార్థనల కోసం శివరాంపల్లి, దానమ్మ హట్స్‌ వైపు నుంచి ఈద్గా, మీర్‌ ఆలం ట్యాంక్‌ వైపు వచ్చే నమాజీల వాహనాలు దానమ్మ హట్స్‌ ఎక్స్‌ రోడ్స్‌ మీదుగా ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు అనుమతించబడతాయి. వాహనదారులు తమ వాహనాలను కింద పేర్కొన్న పార్కింగ్‌ ప్రదేశాలలో పార్క్‌ చేయాలి. ఈ సమయంలో, సాధారణ వాహనాల రాకపోకలను ఈద్గా వైపు అనుమతించరు. దానమ్మ హట్స్‌ ఎక్స్‌ రోడ్ల వద్ద శాస్త్రిపురం, ఎన్‌ఎస్‌ కుంట, తదితరాల వైపు మళ్లిస్తారు.

ఇక్కడ పార్కింగ్‌ స్థలాలు..

ఈద్గా ప్రధాన రహదారి ముందు మోడరన్‌ సా మిల్‌ పార్కింగ్‌తో పాటు, మీర్‌ ఆలం ఫిల్టర్‌ బెడ్‌, మీర్‌ ఆలం ఫిల్టర్‌ బెడ్‌ పక్కన ఖాళీ స్థలం(సూఫీ).

బార్‌ అండ్‌ రెస్టారెంట్స్‌ యాజమాన్య సమస్యలు పరిష్కరించండి



మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ అసోసియేషన్‌ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ యాజమాన్యం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ బార్‌ అండ్‌ రెస్టారెంట్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు శనివారం అసోసియేషన్‌ ప్రతినిధులు మంత్రి జూపల్లి కృష్ణారావును కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అసోసియేషన్‌ అధ్యక్షుడు దామోదర్‌గౌడ్‌ మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనేక దాబాలలో మద్యం సేవించడానికి అనుమతులు ఇస్తున్నారని, అలాంటి దాబాలను నిర్మూలించాలని కోరారు. వైన్‌షాప్‌ల సమయం కంటే బార్‌ అండ్‌ రెస్టారెంట్లకు సమయాన్ని పొడిగించాలని విజ్ఞప్తి చేశారు. బార్‌కు బార్‌కు, వైన్‌షాపుల మధ్య ఆఫ్‌ కిలోమీటర్‌ దూరం ఉండే విధానాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శి ఎం.జైపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్‌ గౌడ్‌, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ద్వానా శాస్త్రి సేవలు ఎనలేనివి



వల్లీశ్వర్‌కు పురస్కారాన్ని అందజేస్తున్న కేవీ రమణాచారి తదితరులు

గన్‌ఫౌండ్రీ: సాహిత్య సవ్యసాచి డాక్టర్‌ ద్వానా శాస్త్రి సేవలు ఎనలేనివని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వ సలహాదారులు డాక్టర్‌ కేవీ రమణాచారి అన్నారు. శనివారం రవీంద్రభారతిలో కిన్నెర ఆర్ట్‌ థియేటర్స్‌, ద్వానా సాహితీ కుటీరంల ఆధ్వర్యంలో డాక్టర్‌ ద్వాన శాస్త్రి 77వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంపాదకులు జి.వల్లీశ్వర్‌ దంపతులకు కిన్నెర–ద్వానా శాస్త్రి స్మారక పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ కలెక్టర్‌ ఏనుగు నర్సింహారెడ్డి, నేటినిజం సంపాదకులు బైస దేవదాస్‌, రచయిత శంకర నారాయణ, ద్వాన శాస్త్రి కుమారుడు శశికాంత్‌, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డితోనే సికింద్రాబాద్‌ అభివృద్ధి



మంత్రి కిషన్‌రెడ్డిని సత్కరిస్తున్న కోల దీపక్‌ కుమార్‌

అబిడ్స్‌: కేంద్ర మంత్రిగా మరోసారి పదవీ బాధ్యతలు స్వీకరించిన జి.కిషన్‌రెడ్డిని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోల దీపక్‌కుమార్‌ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోల దీపక్‌కుమార్‌ మాట్లాడుతూ.. కిషన్‌రెడ్డితోనే సికింద్రాబాద్‌ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. సికింద్రాబాద్‌ నలుమూలలా కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ మీడియా ఇన్‌చార్జి ఎస్‌.వీ సుభాష్‌, బీజేపీ నాయకులు జితేందర్‌ తివారి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వాంజనేయ భక్త సమాజం భజనలు

జియాగూడ: హిమాయత్‌నగర్‌ టీటీడీ దేవస్థానంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రతి యేటా జరిగే వార్షికోత్సవానికి కార్వాన్‌ శ్రీ విశ్వాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో నగర సంకీర్తన, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సమాజం ప్రతినిధి నరసింహాచారి అన్నారు. శనివారం దేవస్థానంలో 19వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శాంతి కల్యాణాన్ని పురస్కరించుకుని టీటీడీ భవనంలో భజన కీర్తనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ప్రతి యేటా బ్రహ్మోత్సవాల్లో భక్తసమాజం ఆధ్వర్యంలో భజన కీర్తనలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు లక్ష్మణ్‌, అంజన్‌, సత్యనారాయణ, రమేష్‌, కృష్ణ, శంకర్‌, శ్రీశైలం, శంకరన్న, చందుచారి పాల్గొన్నారు.



భజన చేస్తున్న విశ్వాంజనేయ భక్త సమాజం బృందం

ఫ్యాన్ల అందజేత



కమిటీ ప్రతినిధులకు ఫ్యాన్లు అందజేస్తున్న మాడిశెట్టి సదానందం గుప్తా

జియాగూడ: అమన్‌గల్‌ మైసిగండి ఆలయంలో 24 ఫ్యాన్లను ఉచితంగా అందజేసినట్లు ఇంటర్నేషనల్‌ వైశ్య ఫెడరేషన్‌ తెలంగాణ ఉపాధ్యక్షుడు మాడిశెట్టి సదానందం గుప్తా అన్నారు. శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేయగా వారు ఘనంగా సన్మానించి సత్కరించి అనంతరం సదానందం మాట్లాడుతూ.. గతంలో మాతేశ్వరీ ఆలయాన్ని దర్శించగా అలయ కమిటీ ప్రతినిధులు తమ దృష్టికి తెచ్చారన్నారు. దీంతో స్నేహితులం కలిసి అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో వనమాల రామస్వామి గుప్తా, రాజన్‌ సింగ్‌, ప్యాట రాజ్‌కుమార్‌, బొజ్జ వెంకటేశం, జగపతి అజయ్‌ పాల్గొన్నారు.

డబ్బులు అడిగితే ఫిర్యాదు చేయండి



చంద్రశేఖర్‌

దూద్‌బౌలి: వాటర్‌ మీటర్‌, కరెంట్‌ మీటర్‌ల పేరుతో డబుల్‌ బెడ్‌రూం లబ్ధిదారులకు ఫోన్లు చేసి డబ్బులు కావాలంటూ వేధింపులకు గురిచేస్తున్న వారిపై కఠినంగా వ్యవహరించనున్నామని.. ఇలా ఎవరికైనా ఫోన్లు వస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని బహదూర్‌పురా తహసీల్దార్‌ చంద్రశేఖర్‌ కోరారు. ప్రభుత్వం తరపున అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నామని ఎవరికి ఎక్కడైనా పైసా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు వసూలు చేసే బ్రోకర్ల పట్ల అప్రమత్తంగా ఉండి వారి వివరాలను తమకు అందజేస్తే.. పోలీసులను సంప్రదించి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయిస్తామన్నారు.

అసదుద్దీన్‌ ఒవైసీకి సన్మానం



యాకుత్‌పురా: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో హైదరాబాద్‌ లోక్‌సభ నుంచి 5వ సారి భారీ మెజార్టీతో విజయం సాధించిన మజ్లిస్‌ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్‌ ఒవైసీని యాకుత్‌పురా అమన్‌నగర్‌–బీ మజ్లిస్‌ పార్టీ అధ్యక్షుడు మహ్మద్‌ మొహీనుద్దీన్‌ ఆధ్వర్యంలో శనివారం నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు అసదుద్దీన్‌ ఒవైసీని సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

హత్యకేసులో ఐదుగురు నిందితుల రిమాండ్‌



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ స్నేహా మెహ్రా

విజయనగర్‌కాలనీ: కత్తులతో విచక్షణారహితంగా దాడిచేసి హత్యచేసిన ఐదురుగు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన శనివారం ఆసిఫ్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సౌత్‌ వెస్ట్‌జోన్‌ ఇన్‌చార్జి డీసీపీ స్నేహా మెహ్రా, అడిషనల్‌ డీసీపీ అశ్వక్‌, ఆసిఫ్‌నగర్‌ డివిజన్‌ ఏసీపీ బి.కిషన్‌కుమార్‌ వివరాలు వెల్లడించారు. 2023 ఆగస్టు 27న ఆసిఫ్‌నగర్‌ బాలాజీ బార్‌ వద్ద సయ్యద్‌ ముజాహిద్‌ సోదరుడి హత్య కేసులో నిందితుడిగా ఉన్న మహ్మద్‌ కుద్బుద్దీన్‌ అలియాస్‌ (కుద్దూస్‌) (27)ను పథకం ప్రకారం ఈ నెల 13న రాత్రి ఆసిఫ్‌నగర్‌ ఇండియన్‌ ఆయిల్‌ పెట్రోల్‌ పంప్‌ వద్ద నడిరోడ్డుపై దాడిచేసి పరారయ్యారు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడిని చికిత్సల నిమిత్తం ఆలివ్‌ ఆసుపత్రికి ఈనెల 14న తెల్లవారుజామున తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. సీసీటీవీ ఫుటేజీలు, సాంకేతిక విశ్లేషన బృందాలతో పోలీసులు హత్యలో పాల్గొన్న నిందితులు సయ్యద్‌ తాహేర్‌ (27) ఫర్నీచర్‌ పాలీష్‌ వర్కర్‌, సయ్యద్‌ ఇమ్రాన్‌ (24) ఫర్నీచర్‌ బిజినెస్‌, సయ్యద్‌ అమన్‌ (24) ఆటోడ్రైవర్‌, సయ్యద్‌ ముజఫర్‌ (32) ఫర్నీచర్‌ పాలీష్‌ వర్క్‌, షేక్‌ జాహేద్‌ (22) పండ్లవ్యాపారి ఈ ఐదుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకు ఉపయోగించిన మారణాయుధలను స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో ఆసిఫ్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ జి.వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి



సుల్తాన్‌బజార్‌: ప్రభుత్వం ఆశా వర్కర్లకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని బీఆర్‌ఎస్‌ కేవీ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబు యాదవ్‌ అన్నారు. శనివారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్‌ ఆధ్వర్యంలో తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్‌ పార్టీ ఆశా వర్కర్లకు రూ.18 వేలు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారని దాని వెంటనే అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రతినెలా ఒకటో తేదీన జీతాలు ఇవ్వాలన్నారు. ఆశా వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌ చేశారు. అర్హత కలిగిన ఆశలకు ఏఎన్‌ఎం ఉద్యోగాలలో అవకాశం కల్పించాలన్నారు. ప్రమాదం, సహజ మరణం పొందిన ఆశావర్కర్లకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ఆశావర్కర్లకు సంబంధం లేని పనులు చేయమని ఒత్తిడి చేయడం, చేయలేని ఆశాలను తొలగిస్తామని బెదిరించడం సరికాదన్నారు. అనంతరం ఆశా కార్యకర్తల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని కుటుంబ వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌ కార్యాలయంలో మెటర్నల్‌ హెల్త్‌ న్యూట్రిషన్‌ జాయింట్‌ డైరెక్టర్‌ పద్మజకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కనీస వేతనాల మాజీ చైర్మన్‌ నారాయణ, బీఆర్‌టీయూ కార్యదర్శి మారయ్య, నాయకులు రూప్‌సింగ్‌, తెలంగాణ గ్రామీణ ఆరోగ్య కార్యకర్తల (ఆశా) సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్‌.సంతోష, ప్రధాన కార్యదర్శి కరుణ, లక్ష్మీ, రేణుక, విజయ, అనిత, రాణి, అపర్ణ, సమత, పుణ్యవతి, రేణుక, మంజుల పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని వినతి




జలమండలి జీఎం కృష్ణా నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

చార్మినార్‌: రాబోయే పండుగలను పురస్కరించుకుని రోడ్లపై మురుగునీరు పొంగి పొర్లకుండా తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవడమే కాకుండా కుళాయిల ద్వారా సరఫరా అయ్యే తాగునీరు కలుషితం కాకుండా జాగ్రత్త వహించాలని కోరుతూ చార్మినార్‌ నియోజకవర్గం బీజేపీ నాయకులు జలమండలి డివిజన్‌–1 జీఎం కృష్ణా నాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పాతబస్తీలోని చాలా ప్రాంతాల్లో కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న కలుషిత నీటిని వెంటనే అరికట్టాలన్నారు. ఆయనను కలిసిన వారిలో బీజేపీ చార్మినార్‌ నియోజకవర్గం కన్వీనర్‌ షెట్టి ప్రవీణ్‌కుమార్‌తో పాటు బీజేపీ సీనియర్‌ నాయకుడు మీర్‌ ఫిరాసత్‌ అలీ బాక్రీ, బీజేపీ గోల్కొండ జిల్లా కిసాన్‌ మోర్చా ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌ యాదవ్‌, సంతోష్‌ తదితరులున్నారు.

లాసెట్‌ ఫలితాల్లో సత్తాచాటిన సీఎస్‌ఏ విద్యార్థులు

నాంపల్లి: సివిల్‌ సర్వీసెస్‌ అకాడమీ హైదరాబాద్‌ (సీఎస్‌ఏ) విద్యార్థులు లా సెట్‌ ఫలితాల్లో సత్తా చాటారు. 2020వ సంవత్సరం నుంచి పేద విద్యార్థులకు ఆన్‌లైన్‌లో ఉచితంగా కోచింగ్‌ను అందిస్తూ వస్తోందని సీఎస్‌ఏ సంస్థ అధ్యక్షుడు మహ్మద్‌సయీదుద్దీన్‌ వెల్లడించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీఎస్‌ఏ సంస్థ మరోసారి విలువలను, నిజాయితీని నిలబెట్టుకున్నట్లు వివరించారు. సీఎస్‌ఏ నిర్వహించిన వెబ్‌నార్లు సత్ఫలితాలు ఇచ్చినట్లు తెలిపారు. లాసెట్‌తో పాటుగా యూపీఎస్‌సీ పరీక్షలపై అవగాహన సదస్సులు ఇచ్చినట్లు తెలిపారు. ఇటీవల విడుదలైన లాసెట్‌ ఫలితాల్లో 125 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించి ప్రవేశానికి అర్హత సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సీఎస్‌ఏ లాసెట్‌ అకాడమీ డైరెక్టర్‌ బషీర్‌ అహ్మద్‌ మాట్లాడుతూ..న్యాయవృత్తిపై ఆసక్తిని కనబరిచి లాసెట్‌ రాసి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు కృతజ్ఞతలు తెలిపారు. సీనియర్‌ న్యాయ అధ్యాపకులతో రోజువారీగా ఆన్‌లైన్‌ తరగతులు నిర్వహించడం జరిగిందన్నారు.

‘విద్యా దీవెన’తో పేద విద్యార్థులకు చేయూత



విద్యార్థులకు అడ్మిషన్‌ పత్రాలు అందజేస్తున్న ఆశీష్‌కుమార్‌ యాదవ్‌

అబిడ్స్‌: గోషామహల్‌ అసెంబ్లీ నియోజకవర్గంలోని పేద విద్యార్థులకు విద్యా దీవెన కార్యక్రమం ద్వారా తాను సొంత ఖర్చులతో చేయూతనందిస్తున్నట్లు నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఆశీష్‌కుమార్‌ యాదవ్‌ పేర్కొన్నారు. కళాశాలల ఫీజులు కట్టలేని పేద విద్యార్థుల కోసం తాను అండగా ఉండి వారికి ఫీజులు చెల్లించి విద్యను బోధించనున్నట్లు తెలిపారు. శనివారం అబిడ్స్‌లోని తన కార్యాలయంలో పలువురు విద్యార్థులకు పలు కళాశాలల్లో డబ్బులు చెల్లించి విద్యా దీవెన కార్యక్రమం ద్వారా కళాశాల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆశీష్‌కుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ..విద్యాదానం మహాదానం అన్నారు. ప్రతి ఒక్కరికి విద్య ఎంతో అవసరమన్నారు. పేదల కోసం విద్యను అందించేందుకు తాను ముందుంటానని ఆయన అన్నారు. గోషామహల్‌ నియోజకవర్గం ప్రజలకు అండగా ఉండి వారి సంక్షేమానికి కృషి చేస్తానన్నారు.

అభివృద్ధి పనులను అధికారులు పర్యవేక్షించాలి



బల్దియా డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: అధికారుల నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకీ మెరాజ్‌ కాలనీలోని తన కార్యాలయానికి వచ్చిన బల్దియా డిప్యూటీ కమిషనర్‌ శశిరేఖదేవితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై ప్రజలు తనకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. సంబంధిత అధికారులు అభివృద్ధి పనులు పర్యవేక్షించకపోవడంతోనే ఈ సమస్య తలెత్తుతుందన్నారు. రోడ్ల ప్యాచ్‌వర్క్‌లు, సీసీ రోడ్లు తదితర విషయాలపై ప్రతినిత్యం ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. టోలిచౌకీ, ఎండిలైన్స్‌, కార్వాన్‌ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న వరద నీటి పైప్‌లైన్‌ పనులు నేటికీ పూర్తి కాలేదని ఆయన అన్నారు. గోల్కొండ ఒవైసీ ప్లేగ్రౌండ్‌, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల తదితర ప్రాంతాల్లో చెత్త పేరుకుపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తమ విధులను మరచి పనులపై శ్రద్ధ కనబరచడం లేదని ఆయన అన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు తమతమ ప్రాంతాల్లో జరుగుతున్న పనులను పరిశీలిస్తూ అవి సకాలంలో పూర్తి అయ్యేలా చూడాలని ఆయన కోరారు.

ప్రత్యేక పూజలు



పూజలు నిర్వహిస్తున్న బీజేపీ నేతలు

నాంపల్లి: కేంద్ర మంత్రి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బీజేపీ నేతలు శనివారం సికింద్రాబాద్‌ ఉజ్జయిని మహంకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర సోషల్‌ మీడియా విభాగం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వికసిత్‌ భారత్‌ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వచ్చే ఐదేళ్లలో బొగ్గు, గనుల మంత్రిత్వ శాఖను సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు జి.కిషన్‌రెడ్డికి శక్తిని ఇవ్వాలని అమ్మవారిని ప్రార్థించినట్లు సోషల్‌ మీడియా విభాగం నేత విజయ్‌ సింగ్‌ రాజ్‌పుత్‌ పేర్కొన్నారు.

టీఎన్జీఓ నాయకులకు సత్కారం



ఎస్‌ఎం ముజీబ్‌ హుస్సేని, జగదీశ్వర్‌ను సత్కరిస్తున్న రహ్మత్‌ అలీ

అబిడ్స్‌: టీఎన్జీఓస్‌ సెంట్రల్‌ అసోసియేషన్‌ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన డాక్టర్‌ ఎస్‌ఎం ముజీబ్‌ హుస్సేనితోపాటు ఇతర నాయకులను టీసీటీఎన్జీఓస్‌ సెంట్రల్‌ అసోసియేషన్‌ తరపున ప్రధాన కార్యదర్శి రహ్మత్‌ అలీ, అసోసియేట్‌ అధ్యక్షుడు హరిప్రసాద్‌, కోశాధికారి దేవులపల్లి శ్రీనివాస్‌, మధు తదితరులు సత్కారం చేశారు. ఈ సందర్భంగా ముజీబ్‌ హుస్సేనితో పాటు కోశాధికారి శ్రీనివాస్‌రావులను సత్కరించి అభినందనలు తెలిపారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నృత్య గురువు రశ్మి సచ్చిదానంద శిష్యురాలు ఆకాంక్ష చౌదరి భరతనాట్య రంగప్రవేశం శనివారం కనుల పండువగా సాగింది. జతిస్వరం, పుష్పాంజలి, గణేష స్తుతి, పాదవర్ణం, అర్ధనారీశ్వరం, థిల్లాన, మంగళం వంటి పలు అంశాలపై చక్కటి హావాభావాలతో సాగిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్‌ కోదండ రాం, సంగీత నృత్య భారతి అకాడమీ డైరెక్టర్‌ పద్మాహేమంత్‌, తల్లిదండ్రులు పవన్‌ చౌదరి, రుూన్సీ చౌదరితో పాటు పలువురు నాట్య ప్రియులు పాల్గొన్నారు.




బీజేపీతోనే బడుగు బలహీనవర్గాల సంక్షేమం



లక్ష్మణ్‌కు బొకేను అందజేస్తున్న డాక్టర్‌ వెన్న ఈశ్వరప్ప

అబిడ్స్‌: బీజేపీ ప్రభుత్వంతోనే బడుగు బలహీనవర్గాల సంక్షేమం కొనసాగుతుందని బీజేపీ రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి డాక్టర్‌ వెన్న ఈశ్వరప్ప పేర్కొన్నారు. శనివారం అబిడ్స్‌ కట్టెల మండిలోని బీజేపీ కార్యాలయంలో రాజ్యసభ సభ్యుడు డాక్టర్‌ లక్ష్మణ్‌ను కలిసి ఆయన ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వెన్న ఈశ్వరప్ప మాట్లాడుతూ..బీజేపీ ఎంపీల విజయంలో ఓబీసీ మోర్చా ఎంతో కృషి చేసిందన్నారు. చేవెళ్ల ఎంపీగా కొండ విశ్వేశ్వర్‌రెడ్డి, మహబూబ్‌నగర్‌ ఎంపీగా డీకే అరుణ గెలుపులో ఓబీసీ మోర్చా కార్యకర్తలు, నాయకులు కీలక పాత్ర పోషించారన్నారు. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓబీసీ మోర్చా నాయకులు ప్రతి బూత్‌లో పర్యటించి ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించే విధంగా కృషి చేశారని డాక్టర్‌ లక్ష్మణ్‌కు ఆయన వివరించారు.

యువకుడి అదృశ్యం



మహమ్మద్‌ సల్మాన్‌ షరీఫ్‌ (ఫైల్‌)

గౌలిపురా: సోదరి ఇంటికి వచ్చిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన భవానీనగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై వి.నరేందర్‌ తెలిపిన వివరాల ప్రకారం..బార్కాస్‌ ప్రాంతానికి చెందిన మహమ్మద్‌ సల్మాన్‌ షరీఫ్‌ (26) తలాబ్‌ కట్టా అమన్‌నగర్‌–బీ ప్రాంతంలో నివాసముండే సోదరి షబానా బేగం వద్దకు ఈనెల 9వ తేదీన రాత్రి 10.30 గంటల సమయంలో వచ్చాడు. అర్ధరాత్రి 2.30 గంటలకు సల్మాన్‌ షరీఫ్‌ పని నిమిత్తం బయటికి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు స్థానిక ప్రాంతాలు, స్నేహితులు, బంధువుల వద్ద వాకబు చేయగా ఎలాంటి ఫలితం లేకుండా పోయింది. దీంతో ఫెరోజ్‌ షరీఫ్‌ తన సోదరుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.